టాకీస్

# అల్లు వారి పెళ్ళి సందడి

## బన్నీ గ్రాండ్ పార్టీ

అల్లు కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. హీరో అల్లు శిరీష్ వివాహం త్వరలో జరగనున్న నేపథ్యంలో, ఆయన సోదరుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన ఫామ్‌హౌస్‌లో గ్రాండ్‌గా ప్రీ-వెడ్డింగ్ పార్టీ ఇచ్చారు. ఈ వేడుకకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అల్లు శిరీష్, నయనిక రెడ్డిల వివాహం మార్చి 6వ తేదీన జరగనుంది. పెళ్లి పనులు వేగంగా జరుగుతున్న క్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల కోసం అల్లు అర్జున్ ఈ పార్టీని ఏర్పాటు చేశారు. - మహా చిత్ర





కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

## ఎదురులేని రేవంత్

మునిసిపల్ ఎన్నికల్లో సంచలన విజయాలతో కాంగ్రెస్ ప్రత్యర్థి బీఆర్ఎస్, బీజేపీలకు ఊహించని షాక్ నిచ్చింది. పట్టణాల్లో కాంగ్రెస్ దూసుకుపోతూ ఆధిపత్యాన్ని కట్టిపడేస్తుండగా, ఎన్నికల వ్యూహాల్లో సీఎం రేవంత్ రెడ్డి చూపిస్తున్న చాణక్యం చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంత పట్టుదలతో వ్యవహరిస్తారని, మంత్రులు ఇంత కసిగా.. జట్టుగా పనిచేస్తారని ప్రత్యర్థులు ఊహించలేదు. సందర్భం వస్తే కాంగ్రెస్ క్యాడర్ అంతా ఏకమై ఎలా పనిచేస్తుందో మునిసిపల్ ఎన్నికలు మరోసారి రుజువుచేశాయి. టీమ్ తెలంగాణ పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. జూన్‌లోపే పెండింగ్ లో ఉన్న పరిషత్, గ్రేటర్ హైదరాబాద్, ఇతర కార్పోరేషన్ల ఎన్నికలు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసైడ్ అయినట్లుగా కనబడుతోంది. ఇదే సమయంలో వరుస ఎన్నికల్లో బీఆర్ఎస్‌బీజేపీ బలం క్షీణిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మూసీ ప్రక్షాళన, గాంధీ సరోవర్ ప్రాజెక్టు హైదరాబాద్ రాజకీయాల్లో గేమ్ ఛేంజర్ అవుతుందనే చర్చ జరుగుతోంది. జీహెచ్ఎంసి విభజనపై సీఎం పక్కా లెక్కలతో, ముందుచూపుతో అడుగులు వేస్తున్నారు. తెలంగాణ బాటలో ఏపీ కూడా పయనిస్తోంది. ఏపీలో స్థానిక ఎన్నికల నగారా త్వరలోనే మోగబోతున్నది.

**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో


ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER APTEL/2014/58382

22-02-2026

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్

సంపుటి- 23 సంచిక- 55 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD ఆదివారం WWW.EPAPER.MAHAADAILY.COM




# ఇదీ.. పవన్ అంటే

- పవన్ కల్యాణ్ చొరవతో
- కొణిదెల గ్రామానికి మహర్దశ
- రూ. 50 లక్షల విరాళంతో 90,000 లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం
- వివిధ పథకాల ద్వారా గ్రామానికి రూ. 6 కోట్లకు పైగా నిధులు

**అమరావతి. మహా** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామాభివృద్ధికి నడుం బిగించిన పవన్, తన వ్యక్తిగత విరాళంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించారు.

మిగతా 2లో



# పైరవీలు పని చేయవు

## మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు

కాంగ్రెస్ పార్టీలో అందరి పనితీరు మీద నిరంతర పర్యవేక్షణ

కష్టం, శ్రమ ఎప్పటికీ వృథాగా పోదు.. డీసీసీ ఎంతో విలువైనది.. దుర్వినియోగం చేయొద్దు

నేను కూడా పార్టీలో వ్యతిరేకత ఎదుర్కొన్నా .. డీసీసీ అధ్యక్షుల శిక్షణా కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. వికారాబాద్‌లో జరుగుతున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణా తరగతులలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. వారసత్వంగా అవకాశాలు ఎవరికీ రావని మనం చేసిన కష్టం, శ్రమ ఎప్పటికీ వృథాగా పోదన్నారు. శిక్షణను శిక్షగా భావించవద్దన్నారు. డీసీసీలుగా పార్టీ మమ్మల్నీ ఎన్నుకున్నది కాబట్టి ఈ జిల్లాపై మాదే ఆధిపత్యం మేమే అధిపతులం అని ఎవరైనా భావిస్తే అది మీరు చేసే మొదటి తప్పిదం అవుతుందన్నారు. డీసీసీ పోస్టు అనేది అధికారం కాదని ఇది కుటుంబ పెద్ద లాంటి బాధ్యత అన్నారు. పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారు ఉంటారన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలో కొత్తేం కాదని మహాత్మాగాంధీ నాటి నుండి కొనసాగుతోందని దీన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంతే తప్ప మనల్ని వ్యతిరేకిస్తున్నారు కాబట్టి అలాంటి వారిని పార్టీ నుంచి బయటకు తరిమేయాలని చూస్తే మీరు పార్టీకి కీడు చేసినవారవుతారన్నారు.

### నేను వ్యతిరేకత ఎదుర్కొన్న...

నేను పీసీసీ చీఫ్‌గా అయ్యేనాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేదని పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని సీఎం చెప్పారు.

మిగతా 2లో

### పైరవీలు పనిచేయవు


దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని వదిలేసి ప్రజల తరపున పోరాడితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందన్నారు.

# ట్రంప్ సర్కార్‌కు రీఫండ్ గండం

## రూ.12 లక్షల కోట్లు తిరిగి ఇచ్చేయాల్సిందే..

రీఫండ్ కోసం కోర్టుల్లో వేల కేసులు

12 నుండి 18 నెలల సమయం పట్టవచ్చంటున్న న్యాయ నిపుణులు




**మహా :** ట్రంప్ సర్కార్ కు రీఫండ్ టెన్షన్ పట్టుకుంది. ప్రపంచ దేశాలపై ట్రంప్ ప్రభుత్వం విధించిన టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో సుంకాల ద్వారా వసూలు చేసిన భారీ మొత్తాన్ని ఎలా రీఫండ్ చేస్తారనే విషయమై సందిగ్ధత నెలకొంది. ట్రంప్ ప్రభుత్వానికి టారిఫ్‌ల ద్వారా ఇప్పటివరకు సుమారు 133 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మొత్తం భారత కరెన్సీలో దాదాపు 12 లక్షల కోట్లు. ఇప్పుడు ఆ డబ్బును కంపెనీలకు ఎలా తిరిగి ఇస్తారనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ రీఫండ్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉండబోతోందని, కొన్ని నెలల సమయం పడుతుందని న్యాయ నిపుణులు అంటున్నారు. ఈ రీఫండ్లు ప్రధానంగా వస్తువులను దిగుమతి చేసుకున్న కంపెనీలకే అందుతాయని తెలుస్తోంది. వస్తువుల ధరలు పెరగడం వల్ల నష్టపోయిన సాధారణ వినియోగదారులకు వాపసు డబ్బులు వచ్చే అవకాశం తక్కువని సమాచారం. ఈ నేపథ్యంలో రీఫండ్ కోసం కంపెనీలు కోర్టులో కేసులు దాఖలు చేస్తున్నాయి. ఇప్పటికే వెయ్యికి పైగా కేసులు నమోదుకాగా, మరిన్ని కేసులు

మిగతా 2లో

### ఇంకో ఐదేళ్ళు పడుతుందన్న ట్రంప్

సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై డోనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. ఇది కోర్టుల్లో మరో ఐదేళ్ల పాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు పలు రాష్ట్రాల గవర్నర్లు తమ రాష్ట్ర ప్రజల తరపున బిలియన్ల కొద్దీ డాలర్లను ట్రంప్ ప్రభుత్వం నుంచి రీఫండ్‌గా డిమాండ్ చేస్తున్నారు. ఇల్లినాయిస్ గవర్నర్ జెబి ప్రిట్‌జ్‌కర్ తన రాష్ట్రంలోని 5.11 మిలియన్ల కుటుంబాల తరపున వాపసు కోరుతున్నారు. ట్రంప్‌ను ఉద్దేశించి ప్రిట్‌జ్‌కర్ గవర్నర్ ప్రచారం విడుదల చేసిన ఒక లేఖలో, సుంకాల వల్ల ప్రతి ఇల్లినాయిస్ కుటుంబానికి 1,700 డాలర్లు ఖర్చయ్యాయని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే తదుపరి చర్య తీసుకుంటామని ప్రిట్‌జ్‌కర్ హెచ్చరించారు.



# భారత్-బ్రెజిల్ కలిస్తే గ్లోబల్ సౌత్ మరింత బలోపేతం

## ప్రధాని మోదీ

**మహా:** అంతర్జాతీయ వేదికపై భారత్, బ్రెజిల్ దేశాలు కలిసి పనిచేస్తే 'గ్లోబల్ సౌత్' స్వరం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్, బ్రెజిల్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రానున్న రోజుల్లో భారీగా పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ వాణిజ్యాన్ని ఏకంగా 20 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

మిగతా 2లో

# ఏఐ ఇంపాక్ట్ సదస్సు సక్సెస్

## తీర్మానంపై 86 దేశాల సంతకాలు.. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



**ఢిల్లీ, మహా:** ఢిల్లీ వేదికగా నిర్వహించిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' విజయవంతమైందని, ప్రపంచ దేశాల నుంచి బలమైన మద్దతు లభించిందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. సదస్సు తీర్మానంపై 86 దేశాలతోపాటు రెండు అంతర్జాతీయ సంస్థలు సంతకం చేసినట్లు తెలిపారు. అమెరికా, బ్రిటన్, కెనడా, చైనా, డెన్మార్క్, జర్మనీ తదితర దేశాలు సంతకం చేసినవాటిలో ఉన్నాయని చెప్పారు. ''ప్రధాని మోదీ 'ఏఐ' దార్శనికతను ప్రపంచం ఆమోదించింది. 'అందరికీ సంక్షేమం.. అందరికీ ఆనందం' అనే సూత్రాలను సమర్థించింది. ఏఐ సౌకర్యాలు, సేవలు, సాంకేతికత అనేవి ప్రతి ఒక్కరికీ చేరేలా కృత్రిమ మేధ వనరులను అందుబాటులో ఉంచేందుకు ప్రపంచ దేశాలు అంగీకరించాయి'' అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో చెప్పారు. ఏఐ దార్శనికతలో.. ఆర్థిక వృద్ధిని సమాజ హితంతో సమతుల్యం చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సదస్సులో 5 లక్షల మందికిపైగా సందర్శకులు పాల్గొన్నారని కేంద్రమంత్రి తెలిపారు. సరికొత్త ఏఐ యుగంలో భారత్ పోషిస్తున్న పాత్రపై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ఈ సమిట్ ప్రతిబింబించిందన్నారు. ఈ సదస్సు ద్వారా మౌలిక సదుపాయాల రంగంలో 250 బిలియన్ డాలర్లకుపైగా, డీప్‌టెక్ రంగంలో 20 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులకు హామీలు లభించాయని వెల్లడించారు.



# హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్

- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సర్క్యులర్
- ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

యాదాద్రి భువనగిరి, మహా

హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ విక్రయాలు జరపవద్దని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు శనివారం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలలో శాంతి భద్రతలు , రహదారి రక్షణను బలోపేతం చేసేందుకు పెట్రోల్ బంక్ యజమానులు నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పించాలి. రహదారి భద్రత నిబంధనలు పాటించుట ప్రతి పౌరుని బాధ్యత. హెల్మెట్ వినియోగం ప్రాణరక్షణకు మరియు

మిగతా 2లో

# మహిళల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ చర్యలు బేష్

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**హైదరాబాద్, మహా :** మహిళల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ చర్యలు బాగున్నాయని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ కాకతీయలో జరిగిన జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ , సహాయ మంత్రి

మిగతా 2లో

# షబ్బీర్ అలీ, రమణారెడ్డి మధ్య సవాళ్లు

## కామారెడ్డిలో ఉద్రిక్తత.. జస్ట్ ఇది ట్రైలరే.. షబ్బీర్ అలీకి ఎమ్మెల్యే కాటిపల్లి వార్నింగ్

**కామారెడ్డి, మహా :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఉద్రిక్తత నెలకొంది. శిశుమందిర్ పాఠశాల వద్దకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేరుకోవడంతో పోలీసులు భారీగా మోహరించారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల విషయంలో ఇరుపార్టీల నాయకులు ఆరోపణలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాల భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజ్ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే రమణారెడ్డి తెలిపారు. కామారెడ్డి ప్రజలకు నిజాలు

మిగతా 2లో






# ఇదీ.. పవన్ అంటే





(మొదటిపేజీ తరువాయి)

ఆయన అందించిన రూ. 50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గ్రామస్థుల దశాబ్దాల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. 2019 ఎన్నికల ప్రచార సమయంలో తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, గత ఏడాది నియోజకవర్గ పర్యటనలో రూ. 50 లక్షల విరాళం అందజేశారు. గ్రామస్థుల ప్రధాన సమస్య అయిన తాగునీటి ఎద్దడిని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఆ నిధులతో 90,000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించాలని సూచించారు. ఈ ట్యాంకు ద్వారా గ్రామంలోని సుమారు 2,000 మందికి రక్షిత తాగునీరు అందనుంది. వేసవికి ముందే నిర్మాణం పూర్తి కావడం పట్ల పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ, అధికారులను అభినందించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ ట్యాంకుతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా సుమారు రూ. 6 కోట్లకు పైగా నిధులను గ్రామానికి మళ్లించారు. 'పల్లెపండగ 1.0' కింద రూ. 20 లక్షలతో మూడు అంతర్గత రహదారులు పూర్తి కాగా, 'పల్లెపండగ 2.0'లో రూ. 45 లక్షలతో ఏడు సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ కింద కొణిదెల జిల్లా పరిషత్ స్కూల్ నుంచి లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గ్రామానికి రహదారి పునరుద్ధరణకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు.

**4 గోకులాలు.. 19 ఇళ్ళు**

గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణ శాఖ ద్వారా 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం 49 ఫీడర్ ఛానల్స్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, రెండు మైనర్ కాలువల పునరుద్ధరణ, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్‌ల మరమ్మతులు కూడా పూర్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామస్థులు కోరిన ప్రతి పనిని చేపడుతూ, కొణిదెల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఏపీ ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది.

# పేదల పెన్నిధి కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆర్థిక కష్టాల్లోనూ సంక్షేమానికి పెద్దపీట
- అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు
- ఎవరైనా డబ్బులు అడిగితే నాకే ఫిర్యాదు చేయండి!
- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీలో మంత్రి జూపల్లి

**కొల్లాపూర్, మహా:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఎవరైనా డబ్బులు అడిగితే సహించేది లేదని, నేరుగా నాకు ఫిర్యాదు చేయండి అన్ని స్పష్టం చేశారు. కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గానికి చెందిన 180 మంది లబ్ధిదారులకు 1.81 కోట్ల రూపాయల కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను మంత్రి జూపల్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆడపిల్ల పెళ్లిలకు మేమున్నామని భరోసా ఇస్తూ ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మితిమీరిన అప్పుల వల్ల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వలేక పోతున్నామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని, రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి కూడా దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇవ్వలేక పోయారని ధ్వజమెత్తారు. ఏది ఏమైనా.. అందరికీ సమాన న్యాయం చేయడం, నిరుపేదల కుటుంబాలు వెలుగులు నింపడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతున్నదని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు . ప్రతి ఇంటికి ఇల్లాలే వెలుగని, మహిళ లక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ. 10 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంపు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పేదల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందుతున్నాయన్నారు. ఉచిత బస్సు సౌకర్యం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తున్నామని తెలిపారు. సన్న బియ్యం పథకాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన వారికి నూతన రేషన్ కార్డులు అందజేస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు అధైర్య పడాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర వంటి వాటిని ప్రవేశపెట్టి రైతులకు ఇబ్బంది లేకుండా ప్రజా ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు.

## పైరవీలు పని చేయవు

(మొదటిపేజీ తరువాయి)

కానీ నేతలందరీ ఇళ్లకు వెళ్లి వారిని కలిశాను.మీకంటే వయసులో,అనుభవంలో చిన్నవాడినే కావచ్చు. కానీ పార్టీ నాకు ఒక అవకాశం ఇచ్చింది నాకు సహకరించాలని నా ఆలోచనలు వారికి చెప్పి అందరినీ ఒప్పించాను. అందరం సమిష్టిగా కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ 2.5 శాతం నుంచి 40 శాతానికి చేరిందన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యేలుగా టికెట్లు ఇచ్చామని ఎమ్మెల్యే టికెట్లు పొందని వారికి ఎమ్మెల్సీగా ఇచ్చామన్నారు. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, ఇన్ ఛార్జి సచిన్ సావంత్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ సర్కార్‌కు రీఫండ్ గండం

(మొదటిపేజీ తరువాయి)

దాఖలయ్యే అవకాశాలున్నాయి.

**రీఫండ్ కోసం ప్రత్యేక వెబ్ సైట్**

రీఫండ్ కు 12 నుంచి 18 నెలల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. 1990ల్లో హార్బర్ నిర్వహణ రుసుము వంటి వాణిజ్య సంబంధిత కేసుల్లో అమెరికాలోని పలు న్యాయస్థానాలు ఇదే తరహా తీర్పునిచ్చాయి. ఆ సమయంలో కంపెనీలకు రీఫండ్ కోసం ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారీ మొత్తంలో డబ్బు వెనక్కి తిరిగి ఇవ్వాల్సి ఉండటంతో కంపెనీల కోసం ట్రంప్ ప్రభుత్వం ఓ వెబ్‌సైట్ రూపొందించే అవకాశం ఉన్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. రీఫండ్ ప్రక్రియలో పలు న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ సరఫరాదారులకు ఏవైనా రీఫండ్ దక్కితే దానిలో భాగం కావాలని ఉత్పత్తిదారులు కేసులు వేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఈ తరహా ఘటనల్లో కొన్నేళ్ల నుంచి కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు.

**గంటల్లోనే సుంకాలు 15 శాతానికి పెంపు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలు చెల్లవని అక్కడి సుప్రీం కోర్టు చెప్పిన కొన్ని గంటల్లోనే అధ్యక్షుడు మరో నిర్ణయం తీసుకున్నారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా వాటిని 15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సొంత సామాజిక వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు.



## హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ సభ్యుల సంక్షేమం అత్యంత అవసరమని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించని వ్యక్తులు పెట్రోల్ కోసం వచ్చినపుడు, ఖచ్చితంగా హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పించాలని, ఈ విషయమై పెట్రోల్ బంక్ ప్రాంగణంలో స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేయాలని, సంబంధిత సిబ్బందికి ఈ ఆదేశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ ఆదేశాలను జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులలో అమలు చేయు విధంగా చూడాలని, ఉల్లంఘన జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యంగా సర్పంచులు పరిపాలన సాగించాలి



ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతలో స్వర్ణ భారతి ట్రస్ట్‌లో శనివారం శంషాబాద్ మండలంలోని నూతన సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ శిబిరంలో జిల్లా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డి ఎల్ పి యు సతీష్ రెడ్డి, టి ఓ టి లు, ఎంపీడీవోలు ఎంపీఓ లతో కలిసి పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ పంచాయతీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సర్పంచులకు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచులదే అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు, నిబంధనలు, నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమన్నారు. గ్రామస్థాయిలో పరిపాలన సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన నైపుణ్యం, జ్ఞానం శిక్షణ శిబిరంలో అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పొందిన సర్పంచులకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రధానం చేశారు.శిక్షణ కార్యక్రమం గ్రామ అభివృద్ధికి అత్యంత కీలకమన్నారు. నేర్చుకున్న అంశాలను గ్రామ అభివృద్ధికి సహాయపడుతుందన్నారు. పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్-బ్రెజిల్ కలిస్తే గ్లోబల్ సౌత్ మరింత బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

భారత పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా ద సిల్వాతో ప్రధాని మోదీ శనివారం దిల్లీ సమావేశమయ్యారు. ఇరువురి నేతల మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. భవిష్యత్ కోసం డిజిటల్ పార్ట్‌నర్‌షిప్, రేర్‌ఎర్త్ అండ్ క్రిటికల్ మినరల్స్, స్టీల్ సరఫరా గొలుసులో మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి మూడు ఒప్పందాలపై వారిద్దరు సంతకాలు చేశారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లులా ద సిల్వా రాక పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "అధ్యక్షుడు లులాకు, ఆయనతో వచ్చిన ప్రతినిధుల బృందానికి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉంది" అని మోదీ అన్నారు. లులా దార్శనికత, నాయకత్వంలో ఇరు దేశాల సంబంధాలు ఎంతో బలపడ్డాయని కొనియాడారు. గత కొన్నేళ్లలో లులాను తాను పలుమార్లు కలిశానని మోదీ గుర్తు చేసుకున్నారు. ప్రతి కలయికలోనూ భారత్‌పై ఆయనకు ఉన్న నమ్మకం, గొప్ప స్నేహభావం తనకు కనిపించాయన్నారు. ప్రస్తుతం భారత్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 'గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో లులా పాల్గొన్నారు. దీనిపై ప్రధాని మోదీ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. లులా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త శక్తిని ఇచ్చిందని మోదీ వ్యాఖ్యానించారు.

**టెక్నాలజీ అనుసంధానం**

లాటిన్ అమెరికా దేశాల్లో భారత్‌కు బ్రెజిల్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఈ విషయాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు పెంచాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈ వాణిజ్యం కేవలం ఒక అంకె మాత్రమే కాదని ఆయన అన్నారు. ఇది రెండు దేశాల మధ్య ఉన్న నమ్మకానికి, మైత్రికి ప్రతీక అని అభివర్ణించారు. బ్రెజిల్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఏర్పాటు చేయనున్నారు.

# షబ్బీర్ అలీ, రమణారెడ్డి మధ్య సవాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

తెలియాల్సిన అవసరం ఉందని, సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. మరోవైపు ఎమ్మెల్యే రమణారెడ్డి చేసిన సవాల్‌ను కాంగ్రెస్ నేతలు స్వీకరించారు. తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఆయన అవినీతిని నిరూపిస్తామంటూ పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు రమణారెడ్డి ఇంటి వద్దకు, వేదికగా నిర్ణయించిన శిశుమందిర్ వద్దకు వచ్చేందుకు ప్రయత్నించారు. కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు రమణారెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుని, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పలువురు బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతల కారుపై దాడి చేశారు. అద్దాలను ధ్వంసం చేసి పల్టీలు కొట్టించారు. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

**ఇది ట్రైలర్ మాత్రమే- ఎమ్మెల్యే కాటిపల్లి**

కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డి వేదికగా మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు.

**నాకేం జరిగినా సీఎందే బాధ్యత**

263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## మాతృభాష గొప్పతనాన్ని మరువ వద్దు

తెలుగునాడు సమితి ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవ వేడుకలు

**కుషాయిగూడ, మహా:** మాతృభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని ప్రధాన ఉపాధ్యాయురాలు బి అరుణాదేవి అన్నారు. తెలుగునాడు సమితి ఆధ్వర్యంలో కుషాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో బి అరుణాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు నేలపై ఉన్న ప్రతి ఒక్కరు తెలుగు నేర్చుకోవాలని, తెలుగులోనే మాట్లాడాలని, తద్వారా తెలుగు వికసించాలని కోరారు. తెలుగునాడు సమితి అధ్యక్షులు గుమ్మడి హరిప్రసాద్ మాట్లాడుతూ మన మాతృభాష తెలుగును మర్చిపోవద్దని, కొత్త విషయాలు ఎన్ని నేర్చుకున్న పాత విషయాలు మర్చిపోవద్దని, విద్యార్థులకు సూచించారు. ఇటువంటి భాషా దినోత్సవాలు తరచుగా పాఠశాలల్లో జరపాలని ఆయన కోరారు. తెలుగునాడు సమితి ప్రధాన కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. తెలుగు భాష వికాసానికి, తెలుగు భాష పరిరక్షణకు 2003 సంవత్సరం నుండి తెలుగునాడు సమితి ఎంతో కృషి చేస్తుందని వివరించారు. ధరణి దినపత్రిక సంపాదకులు జి. రోజారాణి విద్యార్థులకు మాతృభాష ప్రాధాన్యతను తెలిపారు. వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పి వీరేశలింగం, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# దుకాణదారుల కారణంగానే ట్రాఫిక్ జామ్...?

## ఇరికిరుకు రోడ్డు ఇబ్బందుల్లో వాహనదారుడు

**మంచాల్ రోడ్డులో వెళ్లాలంటే నరకయాతనే**

**రోడ్డు వెడల్పు పనులపై ఎమ్మెల్యే దృష్టి సారించాలి...**

**మున్సిపల్ కమిషనర్ ట్రాఫిక్ పోలీసులు చొరవచూపాలి**

**ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలి.. పట్నం ప్రజలు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** | **దుకాణదారుల కారణంగానే ట్రాఫిక్ జామ్.?**

ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి మహంకాళి కమాన్ వరకు వెళ్లాలంటే, దుకాణదారుల కారణంగానే నరకయాతన పడుతున్నామన్న వాహనదారులు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి మంచాల్, ఆరుట్ల, రాచకొండ నారాయణపురం వెళ్లే ప్రధాన రహదారి కావడం, అంతేకాకుండా ఈ దారిలో ప్రైవేటు హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్ ఎక్కువగా ఉండడంతో తరచూ వాహనాలు వస్తూ వెళ్తూ రద్దీగా ఉంటుంది.. ఈ రోడ్డులో మహంకాళి కమాన్ వరకు వెళ్లాలంటే నరకయాతనకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. చౌరస్తా నుంచి రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా దుకాణదారులు, పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి తమ వస్తువులను షెల్టర్ బయట పెట్టడంతో, దుకాణం కోసం వచ్చిన వినియోగదారులు తమ వాహనాన్ని నడిరోడ్డుపై నిలపడంతో, ఇటూ అటు వెళ్లే వాహనాలు వెళ్లలేక ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు.. మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ పోలీసులు కలిసి ఇప్పటికైనా దృష్టి సారించి, దుకాణం ముందు వేసిన టెంట్లను పెట్టిన వస్తువులను తొలగించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు వాహనదారులు కోరుచున్నారు.

**రోడ్డు వెడల్పు పనులపై ఎమ్మెల్యే దృష్టి సారించాలి**

**మంచాల్ రోడ్డు విస్తరణ పనుల గురించి స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష నిర్వహించి, రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడానికి గల కారణాలను తెలుసుకొని, ప్రత్యేక దృష్టి సారించి త్వరలో రోడ్డు వెడల్పు పనులను చేపట్టి, ట్రాఫిక్ సమస్యలను తొలగించాలని, పట్నం ప్రజలు ఎమ్మెల్యేను కోరుతున్నట్లు తెలిపారు.**

**అధికారుల నిర్లక్ష్యమా.?**
**పాలకులే కారణమా.?...**

మంచాల్ రోడ్డు విస్తరణ చేపట్టడానికి గతంలో అధికారులు కొలతలు తీసి, గత ప్రభుత్వంలో మార్కింగ్ వేయడం జరిగింది. ఇది జరిగి ఐదారు సంవత్సరాలు గడుస్తున్న, నేటికీ రోడ్డు విస్తరణ పనులు ఏమాత్రం జరగలేదు. ఈ రోడ్డు విస్తరణ పనులు నిలుచుపోవడానికి అధికారుల నిర్లక్ష్యమా.? పాలకుల కారణమా.? అనే ప్రశ్నతో పనులు జరగక ఈరోజు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనితోపాటు సాగర్ రహదారి కూడా రోడ్డున ఇరువైపులా కొలతలు తీసిన ప్రయోజనం లేకపోయింది. ఈనాటికి రోడ్డు వెడల్పు పనులు అలాగే మిగిలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వదిలి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి, ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం కల్పించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ చర్యలు బేష్

(మొదటిపేజీ తరువాయి)



పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖా మంత్రి సీతక్క , బ్యాంకర్లతో కలిసి పాల్గొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలనుసీతక్క వివరించగా, సదస్సులో హర్షం వ్యక్తమైంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 46.68 లక్షల మహిళలు సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని, గత రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ. 35,435 కోట్ల బ్యాంక్ రుణాలు మంజూరు చేశామని, రూ. 1,121 కోట్ల వడ్డీ మాఫీతో పాటు, లోన్ , ప్రమాద బీమా పథకాల అమలు చేస్తున్నామని వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరలో మహిళా సంఘాలకు రూ. 3.5 కోట్ల లాభం వచ్చిందని, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల ద్వారా స్థిర ఆదాయాలు పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ తెలంగాణ చర్యలను ప్రశంసించారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యం పెరిగితేనే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకర్లు కలిసి పనిచేస్తే మహిళా సాధికారత మరింత వేగవంతమవుతుందన్నారు.




## పెళ్ళి వేడుకకు పీసీసీ చీఫ్, మంత్రులు

**మహా: గాంధీభవన్ సీపీఆర్ఓ కప్పర హరిప్రసాదరావు కుమార్తె డాక్టర్ సాయి తేజస్విని, అఖిల్ మనోజ్ ల వివాహ వేడుకకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.**

# ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుళ్లకు లష్కరే కుట్ర!

- ఇతర నగరాల్లోనూ ఐఈడీ పేలుళ్లకు ప్లాన్
- ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా దాడులు జరిగే ఛాన్స్
- ఇస్లామాబాద్ మసీద్ పేలుడుకు ప్రతీకారంగా ఉగ్రవాదుల కుట్రలు



**న్యూఢిల్లీ, మహా:** ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని ఒక ఆలయం మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన దేవాలయాల సమీపంలో పేలుళ్లు జరపాలని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ప్లాన్ చేస్తోందని సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో ఫిబ్రవరి 6న జరిగిన పేలుడుకు ప్రతీకారంగా ఈ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) ద్వారా దాడికి కుట్ర పన్నుతున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 6న ఇస్లామాబాద్‌లోని మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారం తీర్చుకోవడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భద్రతా బలగాలు వెల్లడించాయి.



## బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా (స్ధానిక సంస్థలు) ప్రతిమా సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ప్రతిమాసింగ్ ప్రసూతి సెలవులపై వెళ్ళడం జరిగినది. ఈనెల 20వ తారీకు శుక్రవారం తిరిగి అదనపు కలెక్టర్ గా (స్ధానిక సంస్థలు) బాధ్యతలు చేపట్టడం జరిగింది. తిరిగి బాధ్యతలు చేపట్టిన తాను ప్రజా సమస్యలపై దృష్టి సారించడం జరుగుతుందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో నవజాత శిశువు మృతి.?

### యాచారం సర్కార్ దవఖానలో దారుణం.. దవఖానను సందర్శించిన డిఎంహెచ్ఓ

### శిశువు మరణంపై పరిశీలించి చర్యలు.. వైద్యులపై బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

ప్రసవం సమయంలో వైద్యులు జాగ్రత్తలు పాటించకపోవడంతో నవజాత శిశువు మృతి చెందినట్లు బాధిత కుటుంబీకులు ఆరోపణలు చేశారు.. గురువారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, మల్కీజ్ గూడ గ్రామానికి చెందిన నానకపేట కృష్ణ, తన భార్య కళ్యాణిని ప్రసవం కోసం యాచారం మండల కేంద్రంలోని సర్కారు దావఖానలో చేర్పించారు. ప్రసవం సమయంలో వైద్యులు సరియైన జాగ్రత్తలు తీసుకోలేని కారణంగా, వైద్యం వికటించి శిశువు మృతి చెందారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. యాచారం మండల కేంద్రంలోని సర్కార్ దవఖానల్లో జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి లలితాదేవి,డిప్యూటీ డిఎంహెచ్వో లక్ష్మీ ప్రసన్నతో కలిసి శనివారం ఘటన స్థలానికి చేరుకున్న ఆమె, దవఖానను సందర్శించి పరిశీలించారు. దవఖానలో జరిగిన ఘటనపై వైద్యులను, బాధిత కుటుంబాన్ని, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. దవఖానలోని వైద్యుల, సిబ్బంది పనితీరుపై, మందుల గురించి, పరిసరాలు పరిస్థితులపై జిల్లా వైద్యాధికారులకు వివరిస్తూ మల్కిజ్ గూడ గ్రామ ఉప సర్పంచ్ శిరీష వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో వినతి అందజేశారు.



**బాధితులకు న్యాయం చేస్తాం...**

అనంతరం డిఎంహెచ్వో మాట్లాడుతూ... దవఖానాలో వైద్య పరికరాల కొరత ఉందన్న విషయం వాస్తవమేనని, ప్రసవ సమయంలో శిశువు మరణాన్నికి గల కారణాలను పరిశీలించడం జరిగిందని, ఈ విషయాన్ని సర్కారు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, ప్రసవ సమయంలో వైద్యుల వైద్య సేవల విషయమై పరిశీలించి, ముున్ముందు అవసరమైన చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఓ లలితాదేవి పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని డిఎంహెచ్ లలితాదేవి అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ న్యాయబద్ధంగా పోరాడుతామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డిసిహెచ్ఎస్ అనురాగిణి, గైనకాలజిస్ట్ జలజ, గ్రామస్తులు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ?

### డిసిసి అధ్యక్ష పదవికి రాపోలు రాములు అర్హుడు కాదా?

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు రాపోలు రాములకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్ష పదవి దక్కకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకున్న తాజా నిర్ణయంతో డిసిసి అధ్యక్ష బాధ్యతలు తోటకూర జంగయ్య యాదవ్‌కు అప్పగించగా, పార్టీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రాపోలు రాములు తెలంగాణ ఉద్యమం తొలి దశ నుంచి చురుకుగా పాల్గొంటూ ముందుండి పోరాటం చేశారు. ఉద్యమ కాలంలో అనేక కేసులు ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయలేదు. పదవుల కోసం కాకుండా పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. పార్టీ అధికారంలో లేని కష్టకాలంలో కూడా జిల్లాలో కాంగ్రెస్ కార్యకలాపాలను కొనసాగిస్తూ పార్టీకి బలం చేకూర్చారు. గతంలో మేడ్చల్ నియోజకవర్గం నుంచి బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినప్పటికీ, ప్రజల మధ్యనే ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించారు. స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా మంచి పేరును సంపాదించారు. రాపోలు రాముల తల్లి రాపోలు నరసమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారిగా పోరాడిన చరిత్ర ఉంది. ఉద్యమ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ రాపోలు రాములు తెలంగాణ



ఉద్యమ సమయాల్లో జేఏసీ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఉద్యమ దిశగా చైతన్య పరిచారు. పలువురు ప్రముఖులను జిల్లాకు ఆహ్వానించి భారీ సభలు ఏర్పాటు చేసి ఉద్యమానికి ఊపునిచ్చారు. కళాకారులకు కూడా ప్రోత్సాహం అందించారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో జిల్లాలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో పార్టీ లోపల పునర్విమర్శ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి సమయంలో ఉద్యమపరమైన అనుభవం, ప్రజల్లో పట్టున్న నాయకుడికి డిసిసి బాధ్యతలు అప్పగించి ఉంటే జిల్లాలో పార్టీకి మరింత బలం చేకూరేదనే అభిప్రాయం కార్యకర్తల్లో వినిపిస్తోంది. తెలంగాణ కోసం పోరాడిన నాయకులను గుర్తించడంలో పార్టీ విఫలమైందా? రాపోలు రాములకు డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వకపోవడం సముచితమేనా? అనే ప్రశ్నలు జిల్లాలో చర్చకు దారి తీశాయి. ఇకపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు మేడ్చల్ జిల్లాలో పార్టీ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.



### దశావతార శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన కమిటీ సభ్యులు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల కేంద్రంలోని సుందరయ్య నగర్‌లో నిర్మితమవుతున్న దశావతార శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను స్థానిక ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ ప్రతినిధులు మహోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమం ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సాత్విక వాతావరణాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి పూర్ణాచార్యులు పవన్ శర్మ, ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా సమావేశం

### క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని శ్రీ చైతన్య పాఠ్యప్రణాళిక ప్రాథమిక పూర్వ విద్య విభాగంలో వార్షిక క్రీడా సమావేశం 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడలలో చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. వినూత్నంగా నిర్వహించిన ఆటలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం విలువ కలిగిన బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగరాజు మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో పిల్లల ఏకాగ్రత చదువులు పైనే నిలుపుతూ శరీరానికి ఉల్లాసాన్ని అందించే క్రీడలను విస్మరిస్తున్నారని, క్రీడలతోనే ఏకాగ్రత,ఐక్యత, తల్లిదండ్రుల పట్ల అంకితభావం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ అజిత, ప్రాథమిక పూర్వ విద్య విభాగం ఇంచార్జ్ స్వప్న, పి.ఈ.టి రాజేష్, ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### జర్నలిస్ట్ కప్ 2026 – ప్రారంభోత్సవానికి కలెక్టర్‌కు ఆహ్వానం

**పినపాక ,మహా:** జర్నలిస్ట్ కప్ 2026 ను పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25వ తేదీ నుండి ఎల్చిరెడ్డిపల్లి క్రికెట్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని గౌరవ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కీసర సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.ప్రాంతీయ జర్నలిస్టుల ఐక్యతను, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని క్రీడాభిమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ బృహస్పతి, సీనియర్ జర్నలిస్టులు భరత్, బూర శంకర్, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు

## పోలీసుల అదుపులో కోడి పందాలు, పేకాట నిర్వాహకులు



**కల్లూరు ఏసీపి వసుంధర యాదవ్ వెల్లడి**

**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని గంగారం గ్రామ శివారులో ప్రకాష్ నగర్ కాలనీలో పేకాట ఆడుతున్న 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారినుండి సుమారు 65 వేల రూపాయలు, 2 కోడి పుంజులు, 2 కత్తుల దస్తాలు, 6 మోటార్ సైకిళ్ళు, 11 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం తెల్లవారుజామున ఇన్స్పెక్టర్ శ్రీహరి, ఎస్సై అశోక్ కుమార్ తన సిబ్బందితో సత్తుపల్లి మండలం, గంగారం గ్రామం ప్రకాష్ నగర్ కాలనీ శివారులో దూదిగం కొటేశ్ కి చెందిన పామాయిల్ తోటలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడిచేసి 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీసేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టుబడిన వారినకి కోడిపందేలు నిర్వహిస్తే వచ్చే ఆర్ధిక ఇబ్బందుల గురించి,కేసుల వలన జరిగే నష్టాల గురించి కౌన్సిలింగ్ ఇచ్చామని ఏసిపి తెలిపారు. అనంతరం నిందితులను బైండవర్ నిమిత్తం సత్తుపల్లి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. కల్లూరు సబ్ డివిజన్ లోని పోలీసు స్టేషన్ల పరిధిలో ఎటువంటి కోడిపందేలు, పేకాట,ఆన్లైన్ బెట్టింగ్,అక్రమ ఇసుక రవాణా నిర్వహిస్తే పోలీసు అధికారులకు తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంటాయని ఏసీపీ కోరారు.

**నిందితుల వివరాలు:**

1) బత్తుల రవి వయస్సు 28 సంలు, గంగారం గ్రామం సత్తుపల్లి మండలం.
2) బండారు వెంకటేష్ వయస్సు31 సంలు, గంగారం గ్రామం, సత్తుపల్లి మండలం.
3) గోపతి శ్రీనివాసరెడ్డి s/o సత్యనారాయణరెడ్డి, వృత్తి హెచ్.సి800 పి.ఎస్ దమ్మపేట ఆర్/ఓ దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
4) దూదిగం కొటేశ్ వయస్సు 55 సం"లు, చింతంపల్లి గ్రామం చింతలపూడి మండలం ఏలూరు జిల్లా.
5) మోరంపూడి రంజిత్ వయస్సు - 28 సం"లు, ప్రవేట్ జాబ్ వేమిరెడ్డిపల్లి గ్రామం, విసన్నపేట మండలం,ఎన్టీఆర్ జిల్లా.
6) మొండితోక రాజు, వయస్సు 30 సంIIలు ,ప్రవేట్ జాబ్, అన్నావరం గ్రామం, నుజవీడు మండలం, ఏలూరు జిల్లా.
7) నెర్సు కిరణ్ కుమార్, వయస్సు 30 సంIIలు, అన్నవరం గ్రామం, నుజవీడు మండలం, ఏలూరు జిల్లా.
8) మోరంపూడి చందు,24సంIIలు,ప్రవేట్ జాబ్, వేమిరెడ్డిపల్లి గ్రామం, విసన్నపేట మండలం, ఎన్టీఆర్ జిల్లా.
9) ఆరేపల్లి రామ్, వయస్సు 21 సం"లు, కారు డ్రైవర్, మండలపల్లి గ్రామం, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
10) దేవళ్ళ చిరంజీవి, వయస్సు 35 సం"లు, వడ్డెర, కూలి ఆర్/ఓ గంగారం గ్రామం, సత్తుపల్లి మండలం.
11) దుగ్గిరాల వెంకటేశ్వరావు, వయస్సు 50సం"లు, ఎరుకుల, వ్యాపారం, వావిలాల గ్రామం, తిరువూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా.
12) మోదు పవన్ కళ్యాణ్, వయస్సు 28 సంలు, లంబాడీ, వ్యాపారం, గోపాలపురం గ్రామం, ఏకొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా.
13) దొడ్డా సురేందర్, వయస్సు 27 సం", రెడ్డి , ప్రవేట్ జాబ్, రామన్నపాలెం గ్రామం, వేంసూరు మండలం.
14) పాశం సాయి, వయస్సు 29 సం"లు, నాయకపోడు, కారు డ్రైవర్, మండలపల్లి గ్రామం, దమ్మపేట మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

## 108 అంబులెన్స్‌ను తనిఖీ చేసిన వైద్యాధికారి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ జిల్లాలో నడుస్తున్న 108 అంబులెన్స్ వాహనాలపై సమగ్ర తనిఖీ ఆడిట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా వేగవంతంగా అందుతున్నాయా అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీ సందర్భంగా వాహనాల బయటి లోపలి పరిస్థితి, టైర్లు(స్టెప్నీ సహా), హెడ్‌లైట్లు, ఇండికేటర్లు, సైరన్ పీఏ సిస్టమ్ పనితీరు, జీపీఎస్ వ్యవస్థ పని స్థితి, ఇంధన స్థాయి లాగ్‌బుక్ నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఆర్సీ, ఇన్సూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికేట్ల చెల్లుబాటు స్థితిని ధృవీకరించారు.వైద్య పరికరాలలో ఆక్సిజన్ సిలిండర్ ప్రెషర్ స్థాయి, బీవీఎం(ప్రయోజనులు పిల్లల కోసం), సక్షన్ యంత్రం, బీపీ యంత్రం, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, పల్స్ ఆక్సీమీటర్, స్ట్రెచర్, స్పైన్ బోర్డ్, సర్వైకల్ కాలర్లు, డెలివరీ కిట్ ఇతర అత్యవసర పరికరాలను తనిఖీ చేశారు. అలాగే ఔషధ కిట్‌లో అడ్రినలిన్, అట్రోపిన్, డెక్ట్రోస్, ఐవీ ద్రావణాలు తదితర అత్యవసర మందుల లభ్యత గడువు తేదీలను పరిశీలించారు. అంబులెన్స్‌ల శుభ్రత, లీనెన్ పరిస్థితి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, పీపీఈ కిట్లు హ్యాండ్ శానిటైజర్ల లభ్యతను కూడా ధృవీకరించారు. ప్రజలకు అత్యవసర సేవలు ఎటువంటి లోపాలు లేకుండా అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.



## వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన సర్పంచ్

**కారేపల్లి, మహా :** కారేపల్లిలో నూతనంగా స్టార్ ఎస్ఎస్ వాటర్ ప్లాంట్ ను శనివారం ప్రారంభించారు. కారేపల్లికి చెందిన ఉడతల సంపత్ సరితలు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ) ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నాణ్యతలో రాజీ లేకుండా నాణ్యమైన మినరల్ వాటర్ అందించటం ద్వారా ప్రజల మన్నలను పొందాలని ఆకాంక్షించారు. వినియోగదారుల సంత□ప్తి పర్చటంతోనే వ్యాపారం వ□ద్ధిలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, మాజీ వార్డు మెంబర్ గంగరబోయిన సత్యం, పెద్దలు పాలిక వీరస్వామి, పేర్ని వెంకటేశ్వర్లు, రవి కిరాణం తదితరులు పాల్గొన్నారు.



## ఆశా వర్కర్ల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే

### పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న వేతనాలు, సౌకర్యాల కొరత, పనిభారం వంటి అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అవసరమైతే అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు.శివలింగాపురం ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ) ఏర్పాటు కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆశా వర్కర్లు ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్నారని కొనియాడుతూ వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, పోలమూరి రాజు, సామ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ గణేశ్ రెడ్డి, పాతూరి వెంకన్న, రామ్ రెడ్డి, జీవి, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఐతనబోయిన సతీష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరియాల చైతన్య నాయుడు, హరికృష్ణ, జగన్, నిరుడు రాంబాబు, జీవరత్నం, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తుత్తి గ్రూపులతో బ్యాంకులో లోన్లు...

### ఐకెపి సిబ్బంది మాయాజాలం.. లోన్లు ఇచ్చిన బ్యాంకు మేనేజర్ పాత్రధారే... మొట్లగూడెంలో స్వరాజ్, వినాయక్ గ్రూపుల పేరుతో అక్రమం

### లింకేజీ రుణం పేరుతో రూ. 12లక్షలు కాజేసిన ఘనులు.. కారేపల్లి ఐకేపీ లో భారీ అక్రమం

**కారేపల్లి, మహా:** కంచే చేను మేసిన చందంగా ఉంది కారేపల్లి మండలంలో కొందరి ఐకెపి అధికారుల తీరు. సంస్థలను వ్యవస్థలను కాపాడాల్సిన అధికారులే అడ్డగోలు పనులకు ఆస్కారం ఇచ్చి అభాసుపాలవుతున్నారు. ఐకెపి అధికారులు ఓ బ్యాంకు అధికారి కాసులకు కక్కుర్తి పడి కారేపల్లి మండలం మొట్లగూడెం కేంద్రంగా జరిగిన అక్రమం ఇది. ఉత్తుత్తి గ్రూపులతో భారీ అక్రమానికి తెరలేపారు కొందరు ఐకేపీ సిబ్బంది.. నిబంధనలకు విరుద్ధంగా ఆ గ్రామానికి సంబంధం లేని వేరే ప్రాంతాలకు చెందిన వ్యక్తులను ఆయా గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి కారేపల్లి లోని గ్రామీణ వికాస్ బ్యాంకులో బ్యాంకు లింకేజీ రుణం రూ. 12 లక్షలు కాజేశారు.

**స్వరాజ్, వినాయక్ గ్రూపుల పేరుతో అక్రమం...**

కారేపల్లి మండలంలోని మోట్లగూడెం గ్రామానికి చెందిన అప్పటి అధికారులైన గ్రామ దీపిక, సీసీ, ఏపీఎం, బ్యాంక్ మేనేజర్ కుమ్మక్కై ఈ భారీ అక్రమానికి శ్రీకారం చుట్టారనే ఆరోపణలు ఉన్నాయి. 202223 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి మోట్లగూడెం గ్రామానికి చెందిన స్వరాజ్, వినాయక్ గ్రూపుల్లో కారేపల్లి, ఇల్లందు, కొత్తగూడెం, భద్రాచలం గ్రామాలకు చెందిన వారిని సభ్యులుగా చేర్పించారు. నిబంధనల ప్రకారం మోట్లగూడెం గ్రామానికి చెందిన వారినే సభ్యులుగా చేర్చి వారికి రుణం ఇవ్వాల్సి ఉంది. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి అప్పటి గ్రామ దీపిక, అప్పటి సీసీ వారికి సంబంధించిన బంధువులు స్నేహితుల పేర్లను చేర్పించి బ్యాంకు లింకేజీ కోసం కారేపల్లి లోని గ్రామీణ వికాస బ్యాంకులో రెండు గ్రూపుల్లో 12 లక్షలు రుణం తీసుకుని కాజేశారు. స్వరాజ్ గ్రూపుకు రూ. 6.50 లక్షలు, వినాయక్ గ్రూప్ కి ఆరు లక్షలు బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకొని కాచేశారు. అధికారులు ఇచ్చిన ఫైల్ లో గ్రూపు సభ్యులందరి ఆధార్ కార్డులను ఐకెపి అధికారులు సమర్పించారు. వాటిని తప్పనిసరిగా వెరిఫై చేయాల్సిన బాధ్యత బ్యాంకు మేనేజర్ పై ఉంటుంది. ఐకెపి అధికారులతో కుమ్మక్కైన బ్యాంకు మేనేజర్ వివిధ ప్రాంతాలకు చెందిన ఆధార్ కార్డు దారులు వివిధ బ్యాంకుల అకౌంట్ల నెంబర్లు ఇచ్చినప్పటికీ వాటిని పరిశీలించకుండానే బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేశారు. ఈ 12 లక్షల ను పంచుకున్న వారు కొన్ని నెలలు అనుమానం రాకుండా వాయిదాలను కూడా కట్టారు. తర్వాత రెండేళ్లుగా డబ్బులు కట్టడం మానేయడంతో ఈ రెండు గ్రూపుల అప్పు మొండి బకాయి కిందికి వెళ్ళింది. రికవరీ కోసమని ప్రస్తుత బ్యాంకు మేనేజర్ గ్రూప్ సభ్యులను అడగగా ఆ డబ్బులు మేము తీసుకోలేదని మా అకౌంట్లో మాత్రమే వాడుకున్నారని సమాధానం రావడంతో ఈ మాయాజాలం అంతా వెలుగు చూస్తుంది.


**సీసీ పై కేసు పెట్టాలంటున్న అప్పటి మేనేజర్....**

ఈ బ్యాంకు లింకేజీ రుణం మాయాజాలంపై అప్పటి ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ భాస్కర్ ను ఫోన్లో వివరణ కోరగా.. ఐకెపి నుంచి తప్పుడు పద్ధతిలో ఫైల్ సబ్మిట్ చేసి రెండు గ్రూపులకు లోన్లు ఇప్పించిన అప్పటి సీసీ పై కేసు నమోదు చేయించాలని పేర్కొన్నారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, తిరుపతి | 22-02-2026
ANN తెలుగు

## ఓటీటీలోకి డిఫరెంట్ మూవీ.. ట్రైలర్ రిలీజ్



హీరోయిన్ రష్మిక.. రాబోయే ఓ కొత్త సినిమాలో స్వలింగ సంపర్కురాలిగా నటించనుందనే న్యూస్ తెగ వైరల్ అవుతోంది. ఇది నిజమా కాదా అనేది సదరు మూవీ రిలీజైతే కానీ తెలియదు. అయితే దీనికంటే ముందే ఇప్పుడు ఇదే తరహా కాన్సెప్ట్‌తో తీసిన ఓ హిందీ చిత్రం.. నేరుగా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఇదివరకే స్ట్రీమింగ్ తేదీ ప్రకటించగా.. తాజాగా ట్రైలర్ రిలీజ్ చేసి స్టోరీ ఏంటనేది బయటపెట్టేశారు. ప్రముఖ నటి కొంకనా సేన్, 'లాపతా లేడీస్' ఫేమ్ ప్రతిభ రత్న ప్రధాన పాత్రలు పోషించిన సినిమా 'అక్యూజ్డ్'. నెట్‌ఫ్లిక్స్ సొంతంగా నిర్మించిన ఈ చిత్రం.. సదరు ఓటీటీలోకే వచ్చే శుక్రవారం(ఫిబ్రవరి 27) నుంచి స్ట్రీమింగ్‌లోకి రానుంది. ఇందులో లీడ్ పెయిర్.. లెస్బియన్ కపుల్ పాత్రల్లో నటించడం విశేషం. ఇదో హాలీవుడ్ మూవీకి రీమేక్ అని తెలుస్తోంది. విదేశాల్లో జీవించే ప్రధాన పాత్రధారుల్లో ఒకరు(కొంకనా సేన్).. ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తుంటుంది. అయితే ఈమెపై షాకింగ్ ఆరోపణలు వస్తాయి. ఆస్పత్రిలోని చాలామంది లైంగికంగా వేధిస్తుందని రూమర్స్ బయటకొస్తాయి. దీంతో ఈమె రిలేషన్‌లోనూ ఇబ్బందులు తలెత్తుతాయి. చివరకు ఏమైంది? నిజంగానే సదరు డాక్టర్ అలాంటిదేనా? అనేది మిగతా స్టోరీలా అనిపిస్తుంది. ఈ తరహా కాన్సెప్ట్.. ఇంగ్లీష్ వెబ్ సిరీస్‌ల్లో కనిపిస్తూ ఉంటాయి. మరి ఈ సినిమాని భారతీయ ఆడియెన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి? ఇది తెలుగులోనూ స్ట్రీమింగ్ అయ్యే అవకాశముంది.

## మనసు పిలిచింది



47 సంవత్సరాల తర్వాత కమల్, రజనీ కలిసి నటిస్తున్నారు. ఈ ఇద్దరు తమిళ నటులు తెలుగువారికి ప్రీతిపాత్రులు. తెలుగు కుటుంబాల గుండెల్లో పాగా వేసిన సూపర్‌స్టార్లు. ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్నారంటే తెలుగువారికి ఇద్దరి కథలెన్నో గుర్తుకు వస్తాయి. ఒక నోస్టాల్జియా...

47 సంవత్సరాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటిస్తున్నారు. 'జైలర్' ఫేమ్ నెల్సన్ డైరెక్టర్. దాని గ్లింప్స్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తమిళ, తెలుగు, భారతీయ ప్రేక్షకులను ఉర్రూతలూపుతోంది. నెల్సన్ వారిద్దరి మధ్య పోటీని అలాగే ఉంచుతూ కమలహాసన్‌కు సీనియారిటీ ఇస్తూ తీసిన 'కెహెచ్ అండ్ ఆర్‌కె' స్పెషల్ గ్లింప్స్ అభిమానులను ఎక్కడికో తీసుకెళ్లిపోయింది. తమిళంలోనే ఈ సినిమా తీస్తున్నా తెలుగువారికి స్ట్రయిట్ పిక్చర్‌తో సమానం. ఎందుకంటే వాళ్లిద్దరూ తెలుగువారికీ సూపర్‌స్టార్లే కదా.

తెలుగువారికి రామారావు, నాగేశ్వరరావు ఎలా ఇష్టమో తమిళంలో ఎం.జి.ఆర్, శివాజీ గణేశన్ కూడా అలాగే ఇష్టం. ఎం.జి.ఆర్ తెలుగు ప్రేక్షకులకు నేరుగా తెలియకపోయినా డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుసు. అలాగే తెలుగువారికి కృష్ణ, శోభన్‌బాబు ఎలా ఇష్టమో రజనీకాంత్, కమలహాసన్ కూడా అంతే ఇష్టం. వీరిద్దరూ తెలుగువారితో పాటే తమ కెరీర్‌ను కొనసాగించారు. తెలుగువారు తమను మరువకుండా చూశారు. వారికి అలా కలిసొచ్చింది.

'అంతులేని కథ' (1974)లో ఇద్దరూ యుక్తవయసులో తొలిసారి తెలుగు తెర మీద కనిపించినా ఆ తర్వాత రకరకాల దారుల్లో తెలుగువారికి దగ్గరవుతూ వచ్చారు. కమలహాసన్ 'మరో చరిత్ర'తో సూపర్‌హిట్ కొట్టి తెలుగులో ఎస్టాబ్లిష్ అయిపోయాడు. అయితే రజనీకాంత్ 'చిలకమ్మ చెప్పింది', 'అన్నదమ్ముల సవాల్' చేసినా సరైన దగ్గరితనం 'వయసు పిలిచింది' (1978)తోనే వచ్చింది.

కమల్, రజనీ కలిసి నటించిన ఈ సినిమా తెలుగునాట మహిళా ప్రేక్షకులు రజనీకాంత్‌ను అభిమానించేలా చేసింది. అతని చిక్‌లెట్ మేనరిజం యూత్‌కు నచ్చింది. ఆ రోజుల్లో రజనీ పుణ్యమా అని అందరూ చిక్‌లెట్‌లు తినడమే. మేడ మెట్లు 'అలా కూడా ఎక్కుతారా' అని రజనీని చూసి నోరెళ్లబెట్టారు. స్టయిల్‌ను తెలుగువారికీ రజనీయే పరిచయం చేశాడు. ఆ తర్వాత 'సొమ్మొకడిది సోకొకడిది', 'ఆకలి రాజ్యం' తదితర సినిమాలతో కమల్ - 'టైగర్', 'రామ్ రాబర్ట్ రహీం' సినిమాలతో రజనీ తెలుగు థియేటర్లలో ఆడారు. ఈలోపు వీరి డబ్బింగ్ సినిమాలు వచ్చి పోతూ వీరినీ తెలుగు హీరోలుగా వుంచాయి.

'సాగర సంగమం' కమల్ హాసన్‌కు తెలుగులో శాశ్వత స్థానం సంపాదించి పెట్టింది. ఈ బంగారానికి 'స్వాతిముత్యం' తావి మాత్రమే. ఈ సమయంలో రజనీ తెలుగుకు కొంత ఎడంగా ఉన్నా ఒక్కసారిగా 'ముత్తు' ఆ తర్వాత 'బాషా' సినిమాలతో 'నేను ఒక్క సినిమా తీస్తే వంద సినిమాలు తీసినట్టే' అన్నట్టుగా సూపర్‌హిట్ కొట్టారు. 'అందమైన అనుభవం', 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' (1979) తర్వాత కలిసి నటించడం మానుకున్న కమల్, రజనీ తమ స్టార్‌డమ్, అభిమానుల ఘర్షణల వల్ల ఎడాన్ని కొనసాగిస్తూనే వచ్చారు. నేడు రజనీ 75కు, కమల్ 71కి చేరుకున్నా ప్రేక్షకులు వారిని సూపర్ స్టార్లుగానే తప్ప క్యారెక్టర్ ఆర్టిస్టులుగా చూడ నిరాకరిస్తున్నారు. కాలం మనుషుల్ని దగ్గర చేస్తుంది తప్పదు. ఇన్నాళ్ల తర్వాత ఇద్దరూ ఒకేసారి పక్క పక్కన తెర మీద కనిపించబోతున్నారు. నెల్సన్ దర్శకుడు కాబట్టి కామెడీ కూడా ఉంటుంది. ఇద్దరూ కామెడీ చేయడంలో మేటి కదా. ఈ వంకన ఈ రోజు నుంచే సినీ ప్రేక్షకులు వీరి సినిమా కోసం ఎదురు చూడటం మొదలుపెడతారు. ఏ సంక్రాంతికో, దీపావళికో ఈ డబుల్ ధమాకా దద్దరిల్లనుంది.



## 'స్పిరిట్' భామని రంగంలోకి దించుతున్న నాని?

టాలీవుడ్‌లో మినిమం గ్యారంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని.. ప్రస్తుతం 'ప్యారడైజ్'తో బిజీగా ఉన్నాడు. మరోవైపు 'ఓజీ' సుజీత్ దర్శకత్వంలో త్వరలో ఓ మూవీని ప్రారంభించబోతున్నాడు. ఇవి కాకుండా మరికొన్ని లైన్‌లో ఉన్నాయి. ఇలా కెరీర్ పరంగా మంచి ఫామ్‌లో ఉన్న నాని.. ఇప్పుడు ఓ బోల్ బ్యూటీతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు సిద్ధమయ్యాడట. పలు హిందీ చిత్రాల్లో నటించిన తృప్తి దిమ్రికి.. సందీప్ రెడ్డి వంగా తీసిన 'యానిమల్' మూవీ ఓవర్‌నైట్ స్టార్‌డమ్ తెచ్చిపెట్టింది. బాలీవుడ్‌లో వరస అవకాశాలు అందుకుంటూ బిజీ అయిపోయింది. ప్రస్తుతం తనకు లైఫ్ ఇచ్చిన సందీప్ వంగా తీస్తున్న 'స్పిరిట్'లో ప్రభాస్‌కి జోడీగా చేస్తోంది. మరి మెయిన్ లీడ్ లేదా సెకండ్ హీరోయిన్ అనేది తెలియాల్సి ఉంది. ఇదలా ఉండగానే ఇప్పుడు నాని చేయబోయే ఓ మూవీ కోసం తృప్తిని హీరోయిన్‌గా అనుకుంటున్నారట. ఒకవేళ ఇదే నిజమైతే తృప్తి.. టాలీవుడ్ ఎంట్రీ చిత్రం ఇదే కావొచ్చు. గత కొన్ని సినిమాలతో పాన్ ఇండియా మార్కెట్‌పై దృష్టి పెట్టిన నాని.. అందుకు తగ్గట్లే బాలీవుడ్‌లో మెల్లమెల్లగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం చేస్తున్న 'ప్యారడైజ్'లోనూ ఓ కీలక పాత్ర కోసం రాఘవ్ జ్యూయెల్ అనే నటుడితో కలిసి పనిచేస్తున్నాడు. ఇప్పుడు తృప్తి పేరు వినిపిస్తుంది. చూడాలి మరి ఇందులో ఎంత నిజముందో?



## హిట్టయిన కామెడీ సినిమా..

ఈ వీకెండ్ థియేటర్లలోకి పలు తెలుగు సినిమాలు, డబ్బింగ్ చిత్రాలు వచ్చినప్పటికీ సుహాస్ హీరోగా చేసిన 'హే బలవంత్' పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. కలెక్షన్స్ కూడా బాగానే వచ్చాయి. ఈ మేరకు నిర్మాతలు అధికారిక నంబర్స్ వదిలారు. ఎన్ని కోట్లు వచ్చాయనేది పోస్టర్ రూపంలో విడుదల చేశారు. ఇంతకీ ఈ సినిమా సంగతేంటి? గతవారం రిలీజైన వాటిలో 'కపుల్ ఫ్రెండ్లీ' మంచి రెస్పాన్స్ అందుకోగా.. ఈ వారం 'హే బలవంత్' ఆ బాధ్యత తీసుకుంది. ఇది కాకుండా మరో రెండు మూడు విడుదలైనప్పటికీ వాటికి పాజిటివ్ టాక్ రాలేదు. ఇకపోతే సుహాస్, శివానీ నాగారం, నరేశ్, సుదర్శన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన 'హే బలవంత్' చిత్రానికి ముందురోజు ప్రీమియర్స్ వేశారు. నిన్న(ఫిబ్రవరి 20) థియేటర్లలోకి వచ్చింది. అలా తొలిరోజు రూ.2.14 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చినట్లు నిర్మాతలు ప్రకటించుకున్నారు. సుహాస్ గత చిత్రంతో పోలిస్తే ఇది చాలా బెటర్. వీకెండ్ పూర్తయ్యేసరికి మంచి నంబర్స్ నమోదు చేసే అవకాశముంది. 'హే బలవంత్' విషయానికొస్తే.. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన కృష్ణ(సుహాసన్), తండ్రి బలవంత్(నరేశ్), నాన్నమ్మ(అన్నపూర్ణమ్మ) సంరక్షణలో పెరుగుతాడు. చిన్నప్పటి నుంచి తండ్రిని రోల్ మోడల్‌గా తీసుకున్న కృష్ణ.. ఆయన బిజినెస్ టేకోవర్ చేయాలని అనుకుంటాడు. తండ్రి తొలుత వద్దని చెప్పినప్పటికీ.. కొన్ని అనుకోని పరిస్థితుల్లో అది కృష్ణ చేతుల్లోకి వెళ్తుంది. తండ్రి చేస్తున్న బిజినెస్ ఏంటో తెలిసిన తర్వాత కృష్ణ మైండ్ బ్లాక్ అవుతుంది. దీని వల్లే ప్రేమించిన మిత్ర (శివానీ నాగారం)కి దూరమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇంతకీ బలవంత్ చేస్తున్న బిజినెస్ ఏంటి? దాని వల్ల కృష్ణ ప్రేమకు వచ్చిన చిక్కేంటి? అనేది మిగతా స్టోరీ.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034